


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఆటకట్టు

**ఫీనిక్స్‌కి గంటన్నర ప్రయాణమే డబ్లిన్ నుండి.** నేను చేసిన ప్రయాణాల్లో చిన్నది. ఒక నార్త్ ఇండియన్ కుటుంబం పరిచయం అయ్యారు. ఇండియన్సే కానీ ఎన్నడూ ఇండియా చూడనేలేదుట. ఢిల్లీ, మెడ్రాసూ, లక్నో ఒకదానికొకటి ఎంతెంత దూరం ఉంటాయీ అని అడిగారు. వాళ్ళకి అన్నీ వివరంగా చెప్పాను. వాళ్ళు ఇంకా మంచి హిందీలో మాట్లాడడం నాకు చాలా ఆశ్చర్యం అనిపించింది.

ఫీనిక్స్‌లో దిగగానే మా హరీష్ రెడీగా ఉన్నాడు. ఫోన్ చేసి గేట్ నెంబర్ 7 లోంచి బయటకి రమ్మన్నాడు. నేను అలాగే చేసి, సిద్ధంగా ఉన్న వాడి కారెక్కాను.



హరీష్, సింధు, నక్షత్రతో

మా మరదలు సింధు నేను వస్తానని "రండి రండి. రండీ దయచెయ్యండీ" అనే పాట టేప్‌లో రెడీగా ఉంచిందట. కానీ మేం తను అనుకున్న టైంకల్లా ముందే వెళ్ళిపోయామని డిసప్పాయింట్ అయింది. "పోనీ నువ్వు పాడెయ్" అన్నాను.

ఈ పిల్ల మరదలు కొత్తగా అయింది కానీ, మా మేనత్త మనవరాలు. వాళ్ళకి నక్షత్ర అని రెండున్నరేళ్ళ పిల్ల. దీనికి తెలుగు ముక్క రాకుండా చేసారు పాపం.

నేను ఉన్నన్ని రోజుల్లో దానికి తెలుగులో చెపితే కొన్ని అర్థం అయ్యేట్లు చెయ్యగలిగాను. మా సింధు గురించి ముఖ్యంగా చెప్పాల్సిందేవిటంటే,

"అక్కా... చపాతీలోకి ఏం కూర చెయ్యమా? దాల్‌మఖనీ, ఆలూగోబీ, బగారా బైగన్, కాప్సికమ్ మసాలా.. నీకేది ఇష్టం?" అంటుంది. అన్నింటికీ నాలుగు ఆప్షన్స్ ఇస్తుంది. "ప్రొద్దుటే బ్రేక్‌ఫాస్ట్‌కి పొంగల్, ఉప్మా, రవ్వదోశా, సేమ్యా ఇడ్లీ.. ఏం చెయ్యనూ?" అంటుంది.

"ఏదో ఒకటి చెయ్యి సింధూ" అంటే,

"కష్టం అక్కా.. ఇలా అలవాటు అయిపోయిందీ" అంటుంది.

"ఏదో ఒకటి చెప్పెయ్యక్కా" అనేవాడు మా తమ్ముడు.




నేను నక్షత్రకి తీసుకెళ్ళిన కాలి పట్టాలు, కొంచెం పెద్దవయినా, ఎడ్జస్ట్ చేసి పెడితే, అది ఘల్లు ఘల్లుమని మ్రోగించుకుంటూ తిరుగుతుంటే, అది పిల్లిలా ఏ దొంగ పనీ చెయ్యలేకుండా అయిపోయింది.

"బార్బ్ వస్తానంది నిన్ను చూడడానికి షార్ట్స్‌లో ఉందిట. ఫర్వాలేదా అని అడుగుతోంది" అంది సింధు మధ్యాహ్నం.

"ఫర్వాలేదు. నేను మాత్రం చీర కట్టుకుంటాను" అన్నాను.

ఈ బార్బ్ అమెరికన్. వీళ్ళకి ఫ్యామిలీ ఫ్రెండ్ ఈవిడా ఈవిడ భర్తా, అరవై ఏళ్ళ సీనియర్ సిటిజెన్స్. పిల్లలూ, మనవలూ అంతా ఉన్నారు. వీళ్ళిద్దరూ ఒంటరిగా ఉంటారు. మా సింధు నక్షత్రని నెప్పులు పడుతుంటే, బార్బ్ ఏవీ తినకుండా హాస్పిటల్లో వెయిట్ చేసిందట. మా బావ (సింధు వాళ్ళ నాన్న) పాప పుట్టగానే వెళ్ళి చూసొచ్చానని చెపితే, తనకన్నా ముందే చూసాడని "బాడ్ గ్రాండ్‌పా" అని పేరు పెట్టిందట. వాళ్ళకి కూడా సెంటిమెంట్స్, అభిమానాలూ అధికం అని బార్బ్‌ని చూస్తే తెలిసింది. థాంక్స్‌గివింగ్‌కి వాళ్ళ పిల్లలతో పాటుగా సింధూ, హరీష్ కూడా గిఫ్ట్స్ ఇస్తారట.

బార్బ్ వచ్చేసింది షాట్స్‌లో.. నన్ను చూసి "మీ గురించి ఎంతో విన్నాను" అంది. నాచీర తనకి విపరీతంగా నచ్చింది. నేనూ సింధూ భోజనం చేస్తుంటే, తను అప్పడం తింటూ కబుర్లు చెప్పింది. వాళ్ళాయనతో ప్రొద్దుటే వెళ్ళి పిజ్జాతిని, ఆయన్ని ఇంటికి పంపించి, సింధుకి డ్రైవింగ్ నేర్పించడానికి తను ఇటు వచ్చిందిట. మా సింధూ రోజూ రెండు పూట్లా ఇంత వండడం భర్తకి పెట్టడం, బార్బ్‌కి వింత.

"మేము ఇలా హజ్బెండ్ కోసం కుక్ చెయ్యం. మాకు మేం చేసుకుంటాం, వాళ్ళకి వాళ్ళు చూసుకుంటారు" అంది.

సింధు మా ఇద్దరికీ ఫోటోలు తీసింది. నవంబర్‌లో సింధు తమ్ముడి పెళ్ళికి బార్బ్ కూడా ఇండియా వస్తోందిట. అప్పుడు మా ఇంట్లో కొన్నాళ్ళు ఉండచ్చు అని నేను చెప్పాను.

మా హరీష్ బార్బ్ వస్తే ఢిల్లీ తీసుకెళ్ళి 'కుతుబ్ మినార్' చూపిస్తా అన్నాడు.

"మా ఇల్లు కూడా చూపించెయ్, రెండు చారిత్రాత్మిక స్థలాలు అవుతాయి" అన్నాను.

తరువాత సింధూ, బార్బ్ డ్రైవింగ్‌కి వెళ్ళిపోయారు. నేను నక్షత్రని చూసుకుంటానని చెప్పాను. నక్షత్రా, నేనూ నిద్రపోయాం. ఓ గంటకి వాళ్ళు తిరిగివచ్చారు. కానీ నేను అప్పటికి ఇంకా మాట్లాడే స్థితిలో లేను. తలుపు తీసి అలా సాయంత్రందాకా నిద్రపోయాను.

సాయంత్రం కుశుమ్‌జీ వచ్చింది. ఈవిడ అపార్ట్‌మెంట్స్‌లో జిమ్‌లో పరిచయం అయిందిట. ఈవిడ కొడుకు అక్కడ అమెరికన్ ఆర్మీలో ఆఫీసర్. ఈవిడదో ఓ విచిత్రమైన కథ.

కుశుమ్‌జీ అసలు తన కథ చెప్పడానికే, నన్ను కలుస్తానని ఉత్సాహపడింది.

మా సింధు ఆలూ టిక్కీలు చేసి, టీ పెట్టింది. ఆవిడ అక్కడ బ్యాంక్ ఉద్యోగి. చక్కగా పాటలు పాడుతుంది.

కుశుమ్‌జీ నేనూ 'సత్యమేవజయతే' ఎపిసోడ్ చూసాకా, ఆవిడ గురించి నేను అడిగాను ఆవిడ తన కథ చెప్పింది.

కుశుమ్ సిమ్లాకి చెందిన పహాడీ అమ్మాయి. అక్కడ కాంట్రాక్ట్ పనులకి వచ్చిన కిషన్ ఆమెని ప్రేమించాడు. పెద్దలు పెద్దగా ఇష్టపడలేదు. కానీ అతను ప్రతిరోజూ వెంట పడడంతో కుశుమ్ తన పెద్దలని ఒప్పించింది. అతని తాలూకు వాళ్ళు "మిమ్మల్ని బాగా చూసుకుంటుందా?" అని సందేహం వెలిబుచ్చితే, "మా అమ్మా నాన్నల్లా అత్త మామల్ని చూసుకుంటాను" అని కుశుమ్ మాట ఇచ్చాక

వివాహం జరిగిందిట. భర్త బోంబేకి చెందినవాడు. అక్కడే అతను రెడీమేడ్ బట్టల వ్యాపారం చేస్తూ ఉండగా, ఒక అమ్మాయి, ఒక అబ్బాయి పుట్టారు. ఆమె ఆడబిడ్డా, భర్తా అప్పటికే అమెరికాలో సెటిల్ అయి ఉండడంతో, ఈమె భర్తకి అమెరికా రావాలని కోరిక పుట్టింది.

ఆడబిడ్డ భర్త స్పాన్సర్ చేసాడు. అమెరికా వచ్చారు. అప్పటికి కుశుమ్ చదువుకున్న అమ్మాయి అయినప్పటికీ అస్సలు లోకం తెలీదు. భర్త తెచ్చిన దాంతో సంసారం గడపడం తప్ప. కూతురికి అప్పటికే 21 ఏళ్ళు వచ్చెయ్యడంతో ఆమెకి వీసా దొరకలేదుట. దాంతో పిల్లని మేనమామలింట వదిలి, కొడుకుతో భార్యాభర్తలు న్యూయార్క్ వచ్చారు.


కుశుమ్‌తో

భర్తకి ఓ చిన్న ఉద్యోగం దొరకడంతో, వీళ్ళు వేరే ఇల్లు తీసుకున్నారు. ఆడబిడ్డావాళ్ళు కూడా బాగానే ఉండేవారు. కొంతకాలానికే, కుశుమ్‌కి రాకూడని కష్టం వచ్చింది. ఆమె భర్త ఒక రోడ్డు ప్రమాదంలో హఠాత్ మరణం పాలయ్యాడు.

దీంతో కుశుమ్ కష్టాలు ప్రారంభమయ్యాయి. ఎప్పుడూ గడపదాటి ఎరగదు. భర్త ఎక్కడ ఏం డబ్బు పెట్టాడో తెలీదు. ఇంకా చదువుకుంటున్న రెక్కలు రాని కొడుకు. తనకి చాలా దూరంగా మేనమామల ఇంట్లో పెళ్ళికి ఎదిగిన కూతురు. ఇవన్నీ చాలవన్నట్లు ఆడబిడ్డ వీళ్ళతో మాట్లాడటం మానేసింది. ఈ భారం తమ మీద పడ్తుందేమో, ఎందుకొచ్చిన గొడవ.. అని ఆవిడ అభిప్రాయం అయి ఉంటుంది. తెలిసిన వాళ్ళు ఇండియా వెళ్ళిపోతున్నారుట. కానీ కుశుమ్ చదువుకుంటున్న తన కొడుకుని చూసి, గుండె రాయి చేసుకుని ఓ నిశ్చయానికొచ్చింది. ఒకరింట్లో బేస్‌మెంట్లో ఉంటూ, ఉద్యోగాల వేటకి బయల్దేరింది. బస్సు లెక్కి దిగడం కూడా తెలీదు. ఎక్కడ 'వాంటెడ్ సేల్స్ గర్ల్స్' అని బోర్డ్ ఉంటే అక్కడికి వెళ్ళి జాబ్ అడిగేది. ఒక రెస్టారెంట్‌లో దొరికింది. నెమ్మదిగా ఒక్కో మెట్టూ ఎక్కుతూ బ్యాంక్‌లో ఎకౌంటెంట్‌గా స్థిరపడింది. కొడుకు ఆర్మీలోకి వెళ్ళి మేజర్ అయ్యాడు.

కూతురుకి మంచి సంబంధం చేసింది. ఇద్దరు పిల్లలు. బోంబేలోనే ఉంటుంది. కుశుమ్‌జీ బోంబేలో కూడా ఒక ఫ్లాట్ కొని పెట్టింది. ప్రతి సంవత్సరం వచ్చి వెళ్తూ ఉంటారు. ఇక్కడ ఫీనిక్స్‌లో ఆవిడ ఇంటికి వెళ్ళాం. ఆ రాత్రి మేం 'ఏక్‌తా' టెంపుల్ నుండి సరాసరి వాళ్ళింటికి వెళితే ఆలూ పరోటా, పెరుగూ, నిమ్మకాయ పికిల్ పెట్టింది. నాకు నేర్పించడానికి ఐదు నిమిషాల్లో గోధుమ పిండి హల్వా చేసి పెట్టింది. ఇల్లు అద్భుతంగా ఉంది. తన కొడుకు దగ్గరకి ఒహాయి వెళ్ళిపోతున్నాననీ, తన ఇంట్లో ఉండమని హరీష్‌ని బతిమాలింది. ఎందుకో వీడు ఒప్పుకోలేదు. నవ్వుతూ తీసి పారేశాడు బహుశా స్నేహాలు పాడయిపోకూడదు అనేమో.

కుశుమ్‌జీ ఒంటరి పోరాటం చాలామందికి ఇన్స్పిరేషన్‌గా ఉంటుందని రాసాను. ఎక్కడ సిమ్లా దగ్గర పహాడీ? ఎక్కడ ఫీనిక్స్?

నేను సింధు దగ్గర ఉండగానే మొదట శ్రావణ శుక్రవారం వచ్చింది. "సింధూ రేపు వరలక్ష్మీ వ్రతం నోచుకుందామా?" అన్నాను.

"ఏం చెయ్యాలి వదినా? నాకు రాదు" అంది.

"నేను అన్నీ చేస్తానుగా" అని, సాయంత్రం ఇండియన్ స్టోర్స్‌కెళ్ళి తోరాలకి దారాలూ, కొబ్బరికాయలూ, అగరుబత్తీలు, హారతి కర్పూరం, అరటిపళ్ళూ, తమలపాకులూ, పసుపూ, కుంకుమా, బొంబాయిరవ్వా అన్నీ కొనుక్కొచ్చాం.

ఆ రాత్రే ఇంటర్నెట్‌లో వరలక్ష్మీ వ్రతం తెలుగువన్ డాట్ కాం వాళ్ళది వెతికి ఫేవరెట్స్‌లో పెట్టాను.

ప్రొద్దుటే లేచి సింధూ ఇడ్లీచేసి, హరీష్‌ని ఆఫీస్‌కి పంపించాక, నేను రవ్వ కేసరి చేసి, మినప్పప్పూ, బియ్యం రుబ్బి, దాంట్లో ముంచి బూరెలు వేసాను. పులిహోర చేసాను. పట్టుచీర కట్టుకుని, కలశం పెట్టి, పసుపు వినాయకుడ్ని చేసి, నేను కథ చదువుతూ, తోరపూజతో సహా చేయించాను. ఇద్దరం ఒకరికొకరం, బూరెలు, తాంబూలం, దక్షిణా, వాయినాలు ఇచ్చుకున్నాం.

"ఇస్తినమ్మా వాయినం" అంటే
"పుచ్చుకుంటినమ్మ వాయినం"
"నా వాయినం అందుకున్నది ఎవరమ్మా" అంటే
"నేనమ్మా వరలక్ష్మీదేవిని" అనుకున్నాం
కోరితినమ్మ వరాలు" అంటే
"ఇచ్చితినమ్మ ఫలాలు" అని



కూడా యధేచ్ఛగా అనేసుకున్నాం! ఇచ్చేసుకున్నాం.

మనసు ఉండాలే కానీ ఏదైనా చేయచ్చు. మా సింధు ఇంత శాస్త్రబద్ధంగా చేయించానని ఎంతో ఆనందపడి వాళ్ళమ్మకీ, అత్తగారికీ ఫోన్‌లు చేసింది. వాళ్ళూ చాలా సంతోషించారు.

సాయంత్రం "బార్బ్‌ని పిలిచి వాయినం ఇద్దాం" అని కూడా అన్నాను.

కానీ ఆదిలక్ష్మి అనే తమిళ అమ్మాయిని పేరంటానికి పిలిచింది. ఆ అమ్మాయి భర్త, పిల్లతో కలిసి రాత్రి వచ్చింది. అలా ఆ పేరంటం పూర్తి చేసాం.

ఆదివారం సెడోనా తీసుకెళ్ళాడు హరీష్. కుశుమ్‌జీ కూడా వచ్చింది. సెడోనా ప్రయాణం సరదాగా అంత్యాక్షరీతో జరిగింది. కుశుమ్‌జీ కోసం అందరం హిందీ పాటలే పాడాం.

సెడోనాలో జలపాతాలు బావున్నాయి. నాకు వాటికన్నా దారి పొడవునా ఉన్న ఆపిల్ చెట్లు (ఒక అభిమాని సీమ రేగుపండ్లు అనమన్నాడు) బాగా నచ్చాయి. కొన్ని కోసుకుని తిన్నాం కూడా. మా సింధూ, హరీష్ కూడా ఆపిల్ చెట్లు ఎప్పుడూ చూడలేదుట. నక్షత అన్నింటికీ ఏడ్చి, పేచీలు పెట్టి తన ధర్మం తాను పాటించింది. సెడోనా ఫీనిక్స్ నుండి గంటన్నర. మన ఊటీ అంత చల్లగా ఉండడం విశేషం! కుశుమ్‌జీ ఒక ఆర్ట్ గ్యాలరీకి తీసుకెళ్ళింది. అక్కడ ఫోటోలు తియ్యడానికి లోపల అనుమతించలేదు. అన్నీ వేలడాలర్లలోనే ఉన్నాయి ధరలు. హరీష్ "నాకంత ఆసక్తి లేదు" అని నక్షతని పెట్టుకుని బయటే ఉండిపోయాడు.


నికొలస్ కేజ్

లోపలున్న ఖరీదైన గాజు, స్ఫటిక వస్తువులని చూసి నేను "హరీష్ నక్షతని చూసుకోకుండా, దాన్ని మనతో పంపించి ఉంటే అది ఏం పగలకొట్టినా, మనం జీవితాంతం ఇక్కడ వెట్టి చాకిరీ చేస్తూ ఆ ధర చెల్లించాల్సి వచ్చేది" అన్నాను.

సింధూ కూడా తలచుకుని భయపడింది.

మధ్యాహ్నం సబ్‌వేలో శాండ్‌విచెస్ తిని, ప్రముఖ సినిమా హీరో నికొలస్ కేజ్ ఇల్లు (ఇల్లా అది!!! అద్భుత భవంతి) చూసాం. కానీ ఐ.ఆర్.ఎస్ వాళ్ళు దాన్ని జప్తు

చేసారుట. ఆ ఇంటిని చూడడానికి కొండమీదున్న చర్చ్‌కి వెళ్ళాం.

అక్కడ మేరీమాత ముందు వరుసగా కాండిల్స్ ఉన్నాయి. వాటిని వెలిగిస్తూ మనసులో కోరికలు చెప్పుకోవాలట. మాకు తెలీదు. వెలిగిస్తూ ఫోటోలు తీసుకున్నాం. బయటకి వచ్చేసాక కుశుమ్ జీ చెప్పింది. ఎన్ని కాండిల్స్ వెలిగిస్తే అన్ని డాలర్స్ వెయ్యాలట. అది విన్నాక మళ్ళీ వెళ్ళి నేను ఓ డాలర్ వేసి వచ్చాను. కొన్ని చోట్ల రూల్స్ తెలియకపోవడం ఆనందదాయకం. మా చిలుకూరు బాలాజీ దగ్గర హుండీ ఉండదు ఎంచక్కా. 'వాక్' పుస్తకాలు కొనమంటారు వాళ్ళు.

సెడోనా నుండి వస్తుంటే పెద్ద వాన పడింది. ఫీనిక్స్‌లో మంటలు పుట్టించే ఎండలు, ఓ గంట ప్రయాణం చేస్తే సెడోనాలో చలిగాలులు. భగవంతుడి మాయ.

వాన ఉధ్రుతం పెరిగాకా, మేం హరీష్‌ని కావలిస్తే కారు కాసేపు ఎక్కడైనా ఆపుకుందాం అని గొడవ చేసాం. కానీ ఆ ఎదురు వానలో అలాగే కష్టపడి తీసుకొచ్చేసాడు. బాగా డ్రైవ్ చేసాడు అని మెచ్చుకున్నాం.

ఇంక ఇంటికెళ్ళి వంట చేసే ఓపిక లేదని దవీందర్ ఇండియన్ రెస్టారెంట్‌కి తీసుకెళ్ళాడు. ఆ రోజు ఆదివారం కావడం వలన రష్‌గా ఉంది. మా నక్షత్ర ఇంకా అలసిపోలేదు, వాళ్ళ నాన్నతో ఫుట్‌బాల్ ఆడింది (నిజంగా ఫుట్ బాలే.. కానీ వాడు పక్కకి పడిపోయే పరిస్థితి) మన తెలుగు పిల్లలు కొంచెం ఎక్కువ ఏక్టివ్ ఏమో? కుశుమ్‌జీ వాళ్ళ మనవలు అస్సలు అల్లరి చెయ్యరు అని చెప్తూనే ఉంది పాపం.

ఫ్రైడ్ రైస్, రోటీ, కోఫ్తా కర్రీ, కఢీ ఏదో తెప్పించారు. కొన్ని బావున్నాయి.

కుశుమ్ జీ "ఇదినా ట్రీట్" అని బిల్లు ఆవిడే పే చేసింది.

మరునాడు నాకు అట్లాంటా, హరీష్‌కి సియాటిల్ ప్రయాణాలు. "ఒకటే టైమింగ్స్ వేరే క్యాబ్ తీసుకోనవసరంలేదు అక్కా, నీది సుడిజాతకం" అంది సింధు.

తీరా చూస్తే ఒకే గేట్. ఇద్దరం ఒకే క్యాబ్‌లో వెళ్ళాం. నాకు విపరీతంగా నచ్చింది. క్యాబ్‌లో కూడా మనం క్రెడిట్ కార్డులు వాడగలగడం. ఇక్కడ ఆటోవాడికి చిల్లర లేక మనం ఎంతైనా వదులుకోవాలి. లేదా మనకి ముసలి వయసొచ్చేదాకా వాడు చిల్లర కోసం తిరుగుతుంటాడు.

నేనూ హరీష్ లోపల కపచినో కాఫీ తాగాక, బై చెప్పుకుని వాడు పదో నెంబర్ గేటుకీ, నేను తొమ్మిదో నెంబర్ గేటుకీ వెళ్ళిపోయాం.

అట్లాంటా చేరేటప్పటికి రాత్రి తొమ్మిది. దిగి గేట్ వెతుక్కునీ, రైలెక్కి దిగి, ఎస్కలేటర్ ఎక్కి, లగేజ్ క్లైమ్ దగ్గరకి వెళ్ళేసరికి "అక్కా" అంటూ ఆపద్బాంధవుడిలా డొక్కా ఫణి ఎదురొచ్చాడు. రిలీఫ్‌గా నిట్టూర్చి, సూట్‌కేస్ కలెక్ట్ చేసుకున్నాను. కబుర్లు చెప్తూ ఇంటికి తీసుకెళ్ళాడు. మా ఫణిలో మంచి కథకుడు ఉన్నాడు. ఏది చెప్పినా కథలా చెప్పగలడు. (నా మాట నిజం అని నమ్మాలంటే మంగళవారం అమెరికా మధ్యాహ్నం ఒంటి గంటన్నరకీ, ఇండియా రాత్రి పదిన్నరకీ 'అనగనగా' వినండి.)

గాయత్రి యధాప్రకారం వంట చేసి ఎదురుచూస్తోంది. మరునాడు సుజాతా ఈమని వాళ్ళు మమ్మల్ని డిన్నర్‌కి పిలిచారు. రాత్రి మామూలుగానే కబుర్లు చెప్పుకుని లేట్‌గా పడుకున్నాం.

మరునాడు హెక్టిక్ డే రోజంతా నేనూ గాయత్రీ షాపింగ్.


పల్లవి నాకు మధ్యలో ఓ సారి ఫోన్ చేసి "ఆంటీ మీరు మా ఇంటికి రావచ్చా?" అని అడిగింది.

"రావచ్చా? కాదమ్మా.. వస్తారా అనాలి" అన్నాడు ఫణి.

"విల్ యూ బ్రింగ్ బన్నీ విత్ యూ?" అని మళ్ళీ అడిగింది. పల్లవి అల్లు అర్జున్ ఫ్యాన్.

"నేను తీసుకురావడం కష్టం అమ్మా. నువ్వు ఇండియా వస్తే అల్లు అర్జున్ దగ్గరికి తీసుకెళ్తాను" అని చెప్పాను.

ప్రొద్దుట గాయిత్రి ఇడ్లీలు చేసింది. మధ్యాహ్నం వంట చేసాక, ఇద్దరం బయలుదేరి షాపింగ్‌కి వెళ్ళాం. మొదట వాళ్ళ ఆంజనేయస్వామి టెంపుల్‌కి వెళ్ళాం. దర్శనం చేసుకున్నాక, వాల్ మార్ట్స్, ఆ తర్వాత షాపింగ్ మాల్‌కి వెళ్ళి మా పిల్లలకి హుడీస్, షర్ట్స్, నేను కొన్ని గిఫ్ట్స్ కొన్నాం. గాయిత్రి నాకోసం ఓ ఎక్స్‌పెన్సివ్ పెర్ఫ్యూమ్ కొంది.



గాయిత్రితో

ఆ తర్వాత కాస్ట్‌కోకి వెళ్ళి, ఓ బీ.పి ఆపరేటస్, చాక్‌లెట్స్, కొన్ని క్రీమ్స్ కొన్నాం. గాయిత్రి క్యారీయింగ్ అయి కూడా ఓపిగ్గా తిరుగుతూ నా కోసం ఇవన్నీ చేసింది పాపం.

మేం ముగించేటప్పటికే ఏడున్నర అయింది. ఫణిని, పల్లవిని తీసుకుని సుజాత ఇంటికి రమ్మని చెప్పి మేం డైరెక్ట్‌గా వెళ్ళిపోయాం.

సుజాతా, స్వరూప్(వాళ్ళు సతీష్ అంటారు) పిల్లలూ ఎదురు చూస్తున్నారు. కరెక్ట్‌గా మేం రీచ్ అయ్యేటప్పటికే ఫణి అక్కడున్నాడు.

సుజాత వెళ్ళగానే గారెలు, కొబ్బరి పచ్చడి పెట్టి మా క్షుద్బాధ తీర్చింది. ఆ తరువాత కబుర్లవీ చెప్పుకున్నాక భోజనలు చేసాం.

సుజాత వంట అమోఘం. వంకాయకారం పెట్టిన కూరా, బంగాళా దుంపల కూరా, సాంబారూ, గోంగూర పచ్చడీ, కొత్తావకాయ, కరివేపాకు కారం పొడీ, రవ్వకేసరీ చేసింది. స్వరూప్ అవధాని గారి అవధానం ఎడిట్ చేసి 'అవధనం' అని హెడ్డింగ్ పెట్టాడు. అది మార్చమని ఫణి చెప్పాడు. అదింకా పూర్తవలేదు.




సుజాత ఈమని ఫ్యామలీతో

ఇంటికొచ్చి పడేసరికే పన్నెండు అయింది.

నేను ప్యాకింగ్‌లవీ ముగించి పడుకునే సరికే ఇంకా లేట్ అయింది.

మరునాడు నా ఇండియా ప్రయాణం. గాయిత్రి బ్రేక్‌ఫాస్ట్ చెయ్యకుండా భోజనం చేసి బయలుదేరమని క్యాబేజీ కూరా, సాంబారూ, కొబ్బరి పచ్చడీ చేసి, నాతో చెప్పి, కౌగలించుకుని, మళ్ళీ మళ్ళీ రమ్మని చెప్పి, ఆఫీస్‌కి వెళ్ళిపోయింది.

పల్లవిని తన ఫ్రెండ్ ఇంట్లో వదిలి నాతో ఎయిర్‌పోర్ట్‌కి ఫణి రావాలి. అదీ ఏర్పాటు.

నేనూ, ఫణీ, పల్లవీ భోంచేసాం. పల్లవి ఎప్పటిలా పెరుగన్నం కలిపిస్తే కంచంలో పల్లకీలూ, అవీ వేస్తూ, గంటకి ఆ గుప్పెడన్నం పూర్తి చేసాకా మేం బయలుదేరాం.

ఎయిర్ పోర్ట్‌కి చాలా ముందుగా చేరుకుని అక్కడా కబుర్లు చెప్పుకున్నాం.

పార్ధ రామరాజుగారు ఒక ప్యాకెట్ పుచ్చుకుని అవధానిగారి కోసం ఎదురు చూస్తూ మాకు ఎయిర్ పోర్ట్‌లో కనిపించారు.

నేను ఫణికి థాంక్స్, బై బై చెప్పి, సెక్యూరిటీ చెక్ ఇన్ అయి లోపలికి వెళ్ళేసరికి అక్కడ అవధాని గరికపాటి నరసింహారావుగారు కనిపించారు. పార్ధ రామరాజుగారు తెచ్చిన పంచెలూ, షాల్స్ (ఈయన కావాలనే వాళ్ళకోసం వదిలి వచ్చారట). ఆయన మరిచిపోయారనుకుని తెచ్చి ఈయనకి ఇవ్వబోయాడు. మేం ఇద్దరం హ్యూస్టన్ దాకా కలిసే ప్రయాణం చేశాం. ఆయన అక్కడనుండి

ఫస్ట్‌క్లాస్‌కి తన టికెట్ అప్‌గ్రేడ్ చేయించుకున్నారు. హ్యూస్టన్‌లో ఒక ఎమిరేట్స్ అమ్మాయి పేరు 'రోమంచిక్' నేను ఆ పేరు చదివి, అరబిక్, పర్షియన్ కూడా మన సంస్కృత మూలం నుండే వచ్చాయా? అని డిస్కషన్ పెట్టాను అవధానిగారితో.

ఇది గమనించి ఆ అమ్మాయి మా దగ్గరకి వచ్చి "నా పేరు గురించి ఏం మాట్లాడుకుంటున్నారు? " అని అడిగింది.

"నీ పేరుకి అర్థం చాలా అద్భుతమైన అందం" అని అవధానిగారు చెప్పారు. నిజంగా ఆ అమ్మాయి కూడా అలాగే ఉంది.

"గూస్ బంప్స్ వచ్చేంత అందం" అని నేను చెప్పాను. ఆ అమ్మాయి మురిసిపోయి ఓ కాయితం మీద ఇంగ్లీషులో రాసిమ్మంది. రాసిచ్చాను. ఆ తరువాత వెళ్ళి ఇంకో ఫ్రెండ్‌ని తీసుకొచ్చి ఆమెకీ ఆ అర్థం చెప్పమంది.

నేను అవధాని గారితో "సంతోషం సినిమాలో కోటాలా అందర్నీ తీసుకొచ్చి, మళ్ళీ మళ్ళీ చెప్పుకుంటుందేమో. మీరు ఫస్ట్ క్లాస్ వెయిటింగ్ లాంజ్‌లోకి వెళ్ళిపోండి" అన్నాను.

ఆ తరువాత ఆయన ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం చేసారు. నాకు మాత్రం ఆ పదహారు గంటల ప్రయాణం ఆనందకరంగా, ఫస్ట్ క్లాస్‌ని మించిన లగ్జూరియస్‌గా గడిచింది. నాలుగు సీట్లుండే వరుసలో నేనూ, ఆ చివర్న ఓ అమెరికన్ యువకుడు కూర్చున్నాం. అతను కాసేపయ్యాక నన్ను హాయిగా పడుకోమని తను వెనక్కి షిఫ్ట్ అయిపోయాడు. నేను కాళ్ళు జాపుకుని పడుకుని వచ్చాను. మధ్య మధ్యలో తినడానికి తప్ప లేవలేదు.

దుబాయిలో ఓ జనత జయంతి జయంతీ, జయంతి అప్పారావు అనే దంపతులు కలిసారు. వీరు కాలిఫోర్నియా నుండి వస్తున్నారు. అవధానిగారి ఫ్యాన్స్. ఆయన నా దగ్గర కొచ్చి నాతో మాట్లాడ్డం చూసి, ఆయన కాళ్ళ మీద పడిపోయారు.

దుబాయిలో ఎక్కాక, ప్రయాణం కాస్త బోర్‌గా జరిగింది. ఎవరికో సీటు ఎడ్జస్ట్‌మెంటు కూడా ఇచ్చి, నేను మధ్యలో సీటులో కంజెస్టెడ్‌గా కూర్చోవలసి వచ్చింది.

అనుకున్న సమయానికే మూడుగంటలకి నేను ఇండియా చేరాను.

మా అశ్విన్, మేనల్లుడు శరత్ ఎయిర్‌పోర్ట్ కొచ్చారు.

ఈ మొత్తం ట్రిప్‌లో హరీష్, సింధూ, మా బాబీ, అక్కావాళ్ళు తప్ప మిగతా అందరూ మిత్రులే. కానీ 'అక్కా' అనో చెల్లెలిగానో భావిస్తూ నన్ను అమెరికాలో అంతా అభిమానంగా చూసారు. వాళ్ళందరికీ నా కృతజ్ఞతలు.

అలాగే కౌముది ద్వారా పరిచయం అయిన స్నేహితులు చాలామంది నన్ను ఆప్తురాలిగా భావిస్తారు. వారందరికీ కూడా నా ధన్యవాదాలు.

ఎమెన్ రిపబ్లిక్ నుండి బాలాంత్రపు రమణగారూ, శారదగారూ, వారి అమ్మాయి, అల్లుడూ, మనవడుతో సహా మా ఇంటికొచ్చి నన్ను చూసి, తమ అభిమానం వెళ్ళబుచ్చి వెళ్ళారు మొన్న.


కువైట్‌లో మేరియట్ హోటల్స్ గెస్ట్ రిలేషన్స్ ఆఫీసర్‌గా ఉన్న లలిత కూడా (లిల్లీ లిల్లీ) కువైట్ నుండి ఎన్నో గిఫ్ట్స్, మరెంతో ప్రేమా నా కోసం మూట గట్టుకొచ్చి నన్ను చూసి కొంత సమయం గడిపి వెళ్ళింది.

ఎప్పుడైనా నిరాసక్తత కానీ, నిర్లిప్తత కానీ ఒకవేళ వస్తే.. వీరందరి అభిమానం గుర్తుచేసుకుని ఒక కూనిరాగం తీస్తాను.

**"ప్రతీ మనిషీ తన జన్మకి పరమార్థం తెలుసుకునీ,**
**తన కోసమే కాదు.. పరుల కొరకు బ్రతకాలీ.**
**తానున్నా.. లేకున్నా.. తన పేరు నిలవాలి."**

●●●

Click here to share your comments on this story.


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి